సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 13 । మే । 2023



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 656 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



చిన్నారి మురిసేలా చికిత్స

అనంతపురం సర్వజనాస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో చికిత్సలు అందిస్తున్నారు.

IIలో

గరిష్టం/కనిష్టం
41.1°/23.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. వేసవితాపం అధికంగా ఉంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

మత్తుకు ముకుతాడు!



ఇతను హిందూపురం మండలం సీ.చెర్లోపల్లికి చెందిన సూర్యనారాయణ. వెల్డింగ్ పని చేసే సూర్యనారాయణ 15 ఏళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఎక్కువగా మద్యం సేవించడంతో ఫిట్స్ వచ్చి ఆరోగ్య సమస్య ఏర్పడింది. దీంతో పనికి కూడా సరిగా వెళ్లేవాడు కాదు. భయపడిపోయిన భార్య అతన్ని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలోని డీ–అడిక్షన్ సెంటర్‌లో చేర్పించింది. వైద్యులు సురేష్‌కుమార్ అతన్ని పరీక్షించి మద్యం వల్ల నరాల బలహీనత వచ్చినట్లు చెప్పారు. అనంతరం చికిత్స ప్రారంభించారు. నాలుగు నెలల చికిత్స అనంతరం సూర్యనారాయణ మద్యం పూర్తిగా మానేశాడు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ ఆరోగ్యం మెరుగుపర్చుకున్నట్లు అతను చెబుతున్నాడు.



ఇతను హిందూపురంలోని హస్నాబాద్‌కు చెందిన ఎం.డీ.నయాజ్. మద్యం, గుట్కా అలవాటు ఉండేది. 18 ఏళ్ల పాటు మద్యం తాగడంతో ఆరోగ్యం దెబ్బతినింది. కుమార్తె సహకారంతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలోని డీ–అడిక్షన్ సెంటర్‌ను ఆశ్రయించాడు. 2023 ఫిబ్రవరి 16న నయాజ్‌కు మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ కుమార్ చికిత్సను ప్రారంభించారు. మొదటి రోజు నుంచే మద్యంపై ధ్యాస వెళ్లకుండా మందులను అందిస్తూ వచ్చారు. కొన్నిరోజులకే నయాజ్ తీరులో మార్పు వచ్చింది. ఇప్పుడు మద్యం, గుట్కా పూర్తిగా మానేశాడు. ఆరోగ్యం కూడా కుదుటపడటంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

...ఇలా మత్తుకు బానిసలుగా మారి జీవితాలను దుర్భరం చేసుకున్న ఎందరికో డీ–అడిక్షన్ సెంటర్ నూతన జీవితాన్ని ఇస్తోంది. వైద్యుల ప్రేమపూర్వక చికిత్సలతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి.



- హిందూపురం ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్
- వ్యసనాల బారిన పడిన వారికి వైద్య చికిత్సలు
- 100 మందికిపైగా బాధితుల్లో మార్పు తీసుకువచ్చిన వైద్యులు
- మానసిక వైద్యానికీ ప్రత్యేక వార్డు ఏర్పాటు

హిందూపురం టౌన్: మద్యం, పొగాకు ఉత్పత్తులు, గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలైన వారి కుటుంబాల్లో ఆనందం కరువవుతోంది. మత్తుకు బానిసైన ఇంటి యజమాని అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం పడే క్షోభ అంతా ఇంతా కాదు. ఎన్నో జీవితాల్లో అంధకారం అలముకుంటోంది. దీన్ని గమనించిన ప్రభుత్వం మత్తుకు బానిసైన వారి జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది. మద్యం, మత్తు పదార్థాలు, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి వైద్యం అందించి మామూలు స్థితికి తీసుకువస్తుండగా, బాధిత కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోంది.

471 మందికి కొత్త జీవితం..

2020–21 సంవత్సరంలో పది పడకలతో హిందూపురం ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా సెంటర్ ద్వారా వైద్య సేవలు అందించలేకపోయారు. కోవిడ్ పరిస్థితులు కుదుట పడిన తర్వాత సెంటర్ ద్వారా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ సురేష్ కుమార్ సేవలు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకూ 471 మంది బాధితులకు వైద్య సేవలందించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేశారు. ఇందులో దాదాపు 100 మంది దాకా మద్యం, మత్తు పదార్థాలు, బీడీ, సిగరేట్‌కు బానిసైన వారున్నారు. వారంతా ఇప్పుడు సంతోషంగా కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు.

మత్తుకు.. మానసిక రుగ్మతలకు చెక్..

10 పడకలతో డీ–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు కాగా, చాలా మంది మానసిక రుగ్మతలతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చేవారు. దీంతో ఇక్కడి వైద్యులు ప్రభుత్వానికి విషయం తెలిపి మానసిక రుగ్మతలకు చికిత్స అందించడానికి ప్రత్యేక వార్డుకు అనుమతులు పొందారు. ఆ వెంటనే 10 పడకలతో మరొక వార్డును ఏర్పాటు చేశారు. వీటి ద్వారా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు.

డీ–అడిక్షన్ సెంటర్లో చికిత్సలు ఇలా...

- బీడీ, గుట్కా, గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు బానిసైన వారు. నిద్రమాత్రలు అతిగా వేసుకునే వారికి చికిత్స అందిస్తున్నారు.
- మానసిక రుగ్మతతో పిల్లల్లో మొండి ప్రవర్తన, అతి అల్లరి, బుద్ధి పెరగకపోవడం, చదువుపై ఏకాగ్రత లేకపోవడం, మతిమరుపుతో బాధపడే వారికి వైద్యసాయం చేస్తున్నారు.
- నరాల బలహీనత, ఫిట్స్, విచిత్ర ప్రవర్తన, మానసిక మార్పులతో ఇబ్బందులు, మానసిక, శారీరక సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్య ఆలోచనలకు, నలుగురిలో కలవలేకపోవడం, ఒంటరిగా బయటికెళ్లాలంటే భయపడటం లాంటి వారికీ చికిత్స అందిస్తున్నారు.
- నిద్రలేమి, నిద్రలో నడవడం, మాట్లాడడం, అరవటం లాంటి సమస్యలకు, అనుమానాలు, భయాలు, తమలో తాము మాట్లాడుకోవడం, మనసులో దిగులు, బాధ, జీవితంపై విరక్తి పెంచుకున్న వారికి కౌన్సిలింగ్‌తో పాటు మందులు ఇస్తూ కొత్త జీవితాన్ని ఇస్తున్నారు.

సహకరిస్తే చికిత్స సులువు



మత్తు పదార్థాలకు బానిసైన వారికి, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తున్నాం. మత్తు పదార్థాలు, మద్యం అలవాటుతో అనర్థాలు ఎక్కువ. వాటిని మానేయాలనే సంకల్పం బాధితుల్లో ఉంటే చికిత్స మరింత సులభమవుతుంది.

– డాక్టర్ సురేష్‌కుమార్, మానసిక వైద్య నిపుణుడు

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం



డీ–అడిక్షన్ సెంటర్‌తో పాటు మానసిక రుగ్మతలకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నాం. మత్తు పదార్థాలకు బానిసైన వారు, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారు గతంలో వైద్య సేవలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ఇప్పుడు హిందూపురం ఆస్పత్రిలోనే సేవలు అందుతున్నాయి.

– డాక్టర్ రోహిల్ కుమార్, సూపరింటెండెంట్, హిందూపురం జిల్లా ఆస్పత్రి

సీబీఎస్ఈ ఫలితాలు విడుదల

- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన లేపాక్షి నవోదయ విద్యార్థులు



జ్యోతిక (476)



వర్షిత (476)



సమీర్ (476)



జశ్వంతకుమార్‌రెడ్డి (467)

లేపాక్షి: 10వ, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో లేపాక్షి విద్యాలయ విద్యార్థులు సత్తాచాటారు. ఫలితాలు శుక్రవారం విడుదల కాగా, 10వ తరగతిలో 83 మందికి గాను 83 మంది విద్యార్థులు పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. 500 మార్కులకు గాను జ్యోతిక 476, వర్షిత 476, సమీర్ 476 మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా 12వ తరగతిలో 43 మంది విద్యార్థులకు గాను 43 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. జశ్వంత్‌కుమార్‌రెడ్డి 500 మార్కులకు గాను 467 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు.

అలంకరణలో నెట్టికంటుడు



గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో మూడో రోజు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి డ్రైఫ్రూట్స్ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8.30 నుంచి ఆలయ ముఖ మండప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి సింధూరంతో లక్షార్చన పూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

'గురుకులం'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



కదిరి అర్బన్: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 3వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ సొసైటీ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ మురళీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి బాలురు, బాలికలు, గోరంట్ల బాలికలు, పెనుగొండ బాలికల పాఠశాలల్లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో ఎస్టీలకు 31, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీకి 1, ఎస్టీ (పీహెచ్‌సీ) ఒక సీటు ఉందన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అలాగే 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు ఎస్టీ అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కదిరి బాలికలు 9441059189, బాలురు 9440859247, గోరంట్ల, పెనుగొండ బాలికలు 9000481733 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎప్పటికప్పుడు ఇళ్ల బిల్లులు

- హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి



పక్కా ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి

నల్లమాడ: జగనన్న పక్కాగృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులందరికీ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తెలిపారు. శుక్కవారం ఆయన మండల పరిధిలోని ఆర్. రామాపురంలో నిర్మిస్తున్న పక్కాగృహాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ దశల ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు అందజేస్తున్నందున లబ్ధిదారులు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. అంతకుమునుపు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులు హాజరు పట్టిక, పౌష్టికాహారం నిల్వను పరిశీలించారు. కోడిగుడ్లు, పాలు తదితర పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని చిన్నారులు, గర్భవతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారి వరుణ్, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య పీజీ, యూజీ పరీక్షలు వాయిదా

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న దూరవిద్య పీజీ, యూజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయిదా పడ్డ పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

16న జాబ్‌మేళా



అనంతపురం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కియా ఇండియాలో నీమ్ ట్రైనీ ఉద్యోగానికి డిప్లొమో పూర్తి చేసిన వారు అర్హులని, నెలకు రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఇస్తారని పేర్కొన్నారు. రిలయన్స్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెలకు రూ.10 వేల జీతం ఇస్తారని తెలిపారు. కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో ఉద్యోగానికి ఇంటర్మీడియెట్ (కన్నడ, హిందీ, ఇంగ్లిష్, తమిళ్ మీడియం) చదివిన వారు అర్హులన్నారు. యంగ్ ఇండియా కంపెనీలో ట్రైనీ మేనేజర్ ఉద్యోగానికి నెలకు రూ.15 వేలు జీతం ఇస్తారని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మాటలొద్దు.. చేతల్లో చూపుదాం

- స్పందన అర్జీలు రీఓపెన్ కాకూడదు
- 'జగనన్నకు చెబుదాం' పిటిషన్లు వేగంగా పరిష్కరించాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ''మాటలు చెప్పడం వల్ల ఉపయోగం లేదు. ప్రజా సమస్యలను నాణ్యంగా పరిష్కరించాలి. అర్జీదారుడు సంతృప్తి చెందాలి. అప్పుడే మనం ఏం చెప్పినా ప్రజలు వింటారు'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ఒక్క అర్జీ కూడా రీఓపెన్ కాకూడదన్నారు. రీఓపెన్ పిటీషన్లు జిల్లాలో 28 ఉన్నాయని, శ్రద్ధ తీసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకూ వివిధ శాఖలకు చెందిన 71 పిటీషన్లు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు రోజూ కార్యాలయాలకు రాగానే పిటీషన్లు ఓపెన్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి..

'గడప గడపకూ మన ప్రభుత్వం'లో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 18 పనులు గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో గుర్తించిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో 'నాడు–నేడు' పనులు తనిఖీ చేసి మైనర్ మరమ్మతులు, వంటగదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించే బాధ్యత ఎంపీడీఓలదేనన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజే విద్యాకానుక కిట్ల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓలు, అధికారులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



తమ్మడేపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అమరాపురం: రెండో విడతలో చేపట్టిన 'నాడు–నేడు' పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన తొలుత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. ప్రజా సమస్యలు, స్పందన అర్జీల పరిష్కారంపై ఆరా తీశారు. అనంతరం తమ్మడేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న 'నాడు – నేడు' పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్.ఎం.బాబావలితో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, తరగతి గదులు, భోజన గదుల గురించి అడిగి తెలుసుకున్నారు. అమరాపురం నుంచి కర్ణాటక సరిహద్దు విరుపసముద్రం వరకూ ఉన్న రోడ్డును తవ్వి, కంకర వేసి పనులు అర్ధాంతరంగా నిలిపి వేయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు కలెక్టర్ దృష్టికితేగా, సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎంపీటీసీ సభ్యులు నారాయణ, కెంచప్ప తదితరులు పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ మునిస్వామి, ఎంఈఓ సత్యనారాయణ ఉన్నారు.

రాత్రిళ్లు గస్తీ ముమ్మరం చేయండి

- పోలీసులకు డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశం
- బత్తలపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

ధర్మవరం రూరల్: నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, విలేజ్ రోస్టర్ తదితర వాటిపై ఆరా తీశారు. వేసవిలో చోరీలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, తగు చర్యలు తీసుకుని నివారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు పోలీస్ సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. డీఐజీ వెంట ధర్మవరం డీఎస్పీ టి. శ్రీనివాసులు, రూరల్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ శ్రీ హర్ష, సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎలుగుబంటి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

పావగడ: తాలూకాలోని లింగదహళ్లి గ్రామ సమీపంలో విద్యుదాఘాతానికి గురై ఓ ఎలుగుబంటి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... లింగదహళ్ళి–అరసికెర మార్గంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ గురువారం రాత్రి తెగిపోయింది. అది పాఠశాల ఇనుప తీగల కంచెపై పడింది. రాత్రివేళ పాఠశాల ఆవరణలోకి వచ్చేందుకు ప్రయత్నించిన ఎలుగుబంటికి తీగలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా, అటవీశాఖ అధికారులు మల్లికార్జున, సతీశ్ చంద్ర, బసవరాజు, పాషతో పాటు పశువైద్యాధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గాలీవానతో అతలాకుతలం

- నేలవాలిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ శాఖకు రూ.50 లక్షలకుపైగా నష్టం
- 60 ఎకరాల్లో మామిడి, 3 ఎకరాల్లో బొప్పాయి నాశనం
- గాల్లోకి లేచిన రేకులషెడ్లు.. అక్కడక్కడా కూలిన ఇళ్లు



బత్తలపల్లి వద్ద కూలిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్



గాలికి ఎగిరి పడిన ఇంటి రేకులను చూపుతున్న చెన్నారెడ్డి



జగరాజుపల్లిలోని ఓ తోటలో నేలరాలిన మామిడి కాయలు

పుట్టపర్తి అర్బన్: గాలీవాన జిల్లాను అతలాకుతలం చేసింది. రైతన్న రెక్కల కష్టాన్ని నేలకూల్చింది. గురువారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన గాలీవాన గంటపాటు ఉరుములు, మెరుపులు, వడగండ్లతో ఉక్కిరి బిక్కిరి చేసింది. దీనిదెబ్బకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలవాలగా, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కొత్తచెరువు, గోరంట్ల, పుట్టపర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో పెను నష్టం సంభవించింది. పుట్టపర్తి మండలంలోని పెడపల్లి, బత్తలపల్లి, జగరాజుపల్లి, వెంకటగారిపల్లి, బడేనాయక్‌తండా, గువ్వలగుట్టపల్లి తదితర గ్రామాల్లోని కోత దశకు వచ్చిన మామిడి తోటల్లో టన్నుల కొద్దీ కాయలు రాలిపోయాయి. రెక్కల కష్టం కళ్లముందే గాలికి కొట్టుకుపోగా రూ.లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. పుట్టపర్తి మండలంలోనే దాదాపు 60 ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. అలాగే గోరంట్ల, బత్తలపల్లి మండలం అప్రాచెరువులో బొప్పాయి చెట్లు నేలవాలగా, తీవ్ర నష్టం వచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

దెబ్బతిన్న ఇళ్లు..

గాలీవాన దెబ్బకు జగరాజుపల్లిలో చెన్నారెడ్డి, మోహన్‌రెడ్డి, బత్తలపల్లిలో రామమోహన్‌రెడ్డిలకు చెందిన ఇల్లు దెబ్బతిన్నాయి. గాలి తీవ్రతకు చెన్నారెడ్డి ఇంటి రేకులు ఎగిరిపోయాయి. దిమ్మెలు పడిపోవడంతో మోహన్‌రెడ్డి ఇంటి వంటగది పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో వంట చేస్తున్న మోహన్‌రెడ్డి భార్యకూ స్వల్ప గాయాలయ్యాయి. బత్తలపల్లిలో రామమోహన్‌రెడ్డి ఇంటిపై భారీ చెట్టు కూలడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతినింది.

విద్యుత్ శాఖకు రూ.50 లక్షల నష్టం..

గాలీవాన దెబ్బకు ఒక్క విద్యుత్ శాఖకే రూ.50 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు ఏడీఈ శరవన్ తెలిపారు. పెడపల్లి– బత్తలపల్లి మధ్య 40 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, గోరంట్ల, కొత్తచెరువు సెక్షన్లలో 40 విద్యుత్ స్తంభాలు, మెయిన్ లైన్‌కు సంబంధించి 8 స్తంభాలు కూలిపోయాయన్నారు. పెడపల్లిలో 6 చోట్ల విద్యుత్ తీగలు తెగి ఇళ్లపై పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గురువారం రాత్రి నుంచే విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమించినా సరఫరా పునరుద్ధరించలేకపోయారు. శుక్రవారం కూడా చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బుచ్చయ్యగారిపల్లిలో 'హై ఓల్టేజీ'

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లిలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ హైఓల్టేజీ రావడంతో తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు 20 ఎల్‌ఈడీ టీవీలు, ఫ్రిడ్జ్ కాలిపోయినట్లు వాపోయారు. సాయంత్రం వేళ ఒక్కసారిగా హై ఓల్టేజీ రావడంతో బల్బులు, టీవీలు కాలిపోవడంతో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చాయి. దీంతో గ్రామస్తులు ఏం జరుగుతుందోన్న భయంతో పరిగెత్తుకుంటూ వీధుల్లోకి వచ్చేశారు. ఇళ్లలోకి వెళ్లేందుకు ధైర్యం చాలక చాలాసేపు వీధుల్లోనే ఉండిపోయారు. ఈ ఘటన గ్రామమంతా కలకలం రేపింది.

క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం ప్యాకెట్లను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: పౌష్టికాహారంతోనే చిన్న పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముచ్చురామి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. చిన్న పిల్లలకు ఇచ్చే ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా ఇస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమం ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ సెల్విసాల్మన్, మెడికల్ ఆఫీసర్ దిలీప్‌కుమార్, ఏఎంఓ లక్ష్మి నాయక్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ జయరాం నాయక్, ఆరోగ్య విస్తరణాధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్య, కుమారుడిపై దాడి



గాయపడిన లక్ష్మీదేవి, కార్తీక్

యాడికి: భార్య, కుమారునిపై ఓ వ్యక్తి, అతనితో సహజీవనం చేస్తున్న మహిళ, మరికొందరు కలిసి కళ్లలో కారం చల్లి కట్టెలు, పైపులతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన శుక్రవారం యాడికిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... యాడికిలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన లక్ష్మీదేవి, లక్ష్మినారాయణ దంపతులకు కార్తీక్ అనే కుమారుడు ఉన్నాడు. గత కొద్ది సంవత్సరాలుగా లక్ష్మీనారాయణ.... భార్య, కుమారుడిని కాదని మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. దీనిపై కుటుంబ సభ్యుల మధ్య పలుసార్లు గొడవలు జరిగాయి. శుక్రవారం ఇంటివద్ద ఉన్న లక్ష్మీదేవి, కార్తీక్‌పై లక్ష్మీనారాయణ, పెద్దరాజు, జయమ్మ, లక్ష్మీదేవి, పార్వతీ కలిసి కళ్లలో కారంచల్లి దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

చిన్నారి మురిసేలా చికిత్స



ఇక్కడ కన్పిస్తున్న మూడేళ్ల చిన్నారి పేరు ధరణి. సొంతూరు నార్పల మండలం నడిమిదొడ్డి. తీవ్ర ఆయాసం, జ్వరంతో గత నెల 25న నగరంలోని రైల్వే ఫీడర్ రోడ్డు వద్ద ఉన్న ఓ చిన్నపిల్లల ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బెంగళూరు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. రూ.లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో ధరణి తండ్రి ఎర్రిస్వామి అదే రోజున సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చేర్పించారు. ధరణికి వివిధ రకాల పరీక్షలు చేసి ఊపిరితిత్తుల పొరల్లో చీము ఉన్నట్లు గుర్తించారు. 10 రోజులు పాటు పీఐసీయూలో ప్రత్యేక వైద్యం అందించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉంది. వైద్యులకు రుణపడి ఉంటామని ఎర్రిస్వామి చెబుతున్నారు.



ఈ మహిళ పేరు జయలక్ష్మి. సొంతూరు మిడుతూరు. గత నెల చివరి వారంలో ఆమె కుమారుడు ఐదేళ్ల వయసున్న ఆదిత్యకు జ్వరం రావడంతో పామిడి ఆస్పత్రిలో చూపించారు. ఆదిత్యకు ఫిట్స్ రావడంతో సాయినగర్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు బోలెడు డబ్బు ఖర్చు అవుతుందని, గ్యారెంటీ ఇవ్వలేమని చెప్పారు. దీంతో జయలక్ష్మి చిన్నపిల్లల వార్డులో చేర్పించింది. ఎన్‌సఫలైటీస్‌గా వైద్యులు గుర్తించి పీఐసీయూలో వైద్యం అందించారు. ప్రస్తుతం ఆదిత్య ఆరోగ్యం నిలకడగా ఉందని దేవుళ్లలా వైద్యులు సేవలందించారని జయలక్ష్మి చెబుతున్నారు.

జీజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డు ఏర్పాటు	2000 సంవత్సరం
అప్పట్లో పడకల సామర్థ్యం	30
ప్రస్తుతం పడకలు (అందుబాటులో మరో 100 నుంచి 130 పడకలు)	60
2011లో ఓపీ (ఏడాదికి)	35,604
గతేడాది ఓపీ	38,971
2011లో ఇన్‌పేషంట్లు	4,494
2022లో ఇన్‌పేషంట్లు	14,311

- రూ.లక్షలు ఖర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం
- జీజీహెచ్‌లోని చిన్నపిల్లల వార్డులో ఉత్తమ సేవలు
- చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు, స్టాఫ్‌నర్సులు
- అత్యాధునిక సదుపాయాలు, కార్పొరేట్ హంగులతో వార్డు



చిన్నపిల్లల వార్డులో కనువిందు చేస్తున్న బొమ్మలు

అనంతపురం క్రైం: వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు, వైద్యులు, సిబ్బంది అంకితభావం వల్ల ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు కార్పొరేట్‌స్థాయి వైద్యం అందుతోంది. ఆ విభాగంలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు రౌండ్ ద క్లాక్ అందిస్తున్న సేవలతో చిన్నారుల ఊపిరి నిలుస్తోంది.

నభూతో నభవిష్యత్

చిన్నపిల్లల వార్డులో పీడియాట్రిక్ ఇన్‌టెన్సివ్ కేర్ (పీఐసీయూ), స్టెప్‌డౌన్, హై డిపెండెన్సీ, రెండు యూనిట్లలో చిన్నారులు, నవజాత శిశు కేంద్రం, డీఈఐసీ, న్యూట్రీషియన్ రీహాబిలిటేషన్ సెంటర్‌లోని పసికందులు, పిల్లలకు హెచ్‌ఓడీ డాక్టర్ సుహాసినీ పర్యవేక్షణలో ముగ్గురు అసోసియేట్, ఏడు మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్, నలుగురు పీజీలు, స్టాఫ్‌నర్సులు అందిస్తున్న సేవలు, చిన్నారులు ఆహ్లాదంగా ఆడుకునేందుకు ప్రత్యేక ఆట గది, గోడలకు వేసిన బొమ్మల ఫొటోలు, నిత్యం అందుబాటులో ఉండే స్టాఫ్ నర్సు, వైద్యసిబ్బంది సేవలను పరిశీలిస్తే ఎవరైనా నభూతో నభవిష్యత్ అనాల్సిందే.

ఇతర జిల్లాల నుంచి కూడా...

వార్డులో 17 వెంటిలేటర్లు, మల్టీపారా మానిటర్స్, హై ఫ్లో నావిల్ క్యాన్యులా, ఖరీదైన మందులు, ఏసీలు, అత్యాధునిక సదుపాయాలు, కార్పొరేట్ హంగులతో చిన్నపిల్లల వార్డును ప్రభుత్వం తీర్చిదిద్దింది. సాధారణ జ్వరం, దగ్గుతో మొదలుకొని పాయిజన్, పాము, తేలు కాట్లు, సీజర్స్(వాయి), బ్రాంకో నిమోనియా, ఎన్‌సఫలైటీస్, తలసేమియా, జీఈ తదితర కేసులకు ఇక్కడ అత్యాధునిక వైద్యం అందుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కడప, కర్నూలు ప్రాంత వాసులు ఇక్కడే సేవలుపొందుతున్నారంటే వైద్యం ఏ స్థాయిలో అందుతోందో అర్థం చేసుకోవచ్చు.

ఏడాదిలో వేలాది మందికి వైద్యం

2000లో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 30 పడకలతో చిన్నపిల్లల వార్డు ఏర్పడింది. 2010లో మరో 30 పడకలు ఏర్పాటు చేశారు. 2011 సంవత్సరంలో ఇన్ పేషంట్లు 4494 మంది ఉంటే, గతేడాది (2022)లో 14,311 మంది నమోదయ్యారు. 2011తో పోల్చితే మూడింతలుగా చిన్నారులకు వైద్యం అందుతోంది. సీజనల్ రోజుల్లో ఓపీ 150 నుంచి 200, ఐపీ రోజూ 50 నుంచి 60 వరకు ఉంటుంది. ప్రస్తుతం రెండు యూనిట్లలో కేవలం 60 పడకలు మంజూరైనా...150 నుంచి 200 మంది చిన్నారులకు సేవలందుతున్నాయి.

సమష్టి కృషితో ఉత్తమ సేవలు



వార్డులో స్టాఫ్‌నర్సుల నుంచి పీజీ, ట్యూటర్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు సమష్టిగా చిన్నారులకు నిబద్ధతతో ఉత్తమ సేవలందిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతో చిన్నారులకు కార్పొరేట్‌స్థాయి సేవలందిస్తున్నాం. చిన్నారులు జబ్బుతో వస్తే నయమైపోతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పిస్తున్నాం. మరోసారి సమస్య తలెత్తకుండా ఫాలోఅప్ ట్రీట్‌మెంట్, పౌష్టికాహారం ఏవిధంగా తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం.

– సుహాసిని, హెచ్‌ఓడీ, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్

రేషన్ బియ్యం పట్టివేత

శింగనమల: మండలంలోని వెస్ట్ నరసాపురం సమీపంలోని పొలంలో అక్రమంగా నిల్వ చేసిన 84 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించి బెంగుళూరుకు తరలించడానికి సిద్ధంగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కృష్ణమూర్తి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ జయపాల్, సీఎస్‌డీటీ రాజశేఖర్ పాల్గొన్నారు. రేషన్ బియ్యాన్ని శింగనమల సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు.

జైలును తనిఖీ చేసిన డీఐజీ



జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు

గుత్తి: గుత్తి స్పెషల్ జైలును శుక్రవారం కడప రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వర రావు తనిఖీ చేశారు. ముందుగా డీఐజీకి జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు స్వాగతం పలికారు. డీఐజీ జైలులోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఖైదీల బ్యారెక్‌లను, మౌలిక వసతులతో పాటు రికార్డులను తనిఖీ చేశారు.

బాల్య వివాహం అడ్డగింత

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడగట్ట గ్రామంలో శుక్రవారం అధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన అమ్మాయి (16)కి, అబ్బాయి (18)తో వివాహం చేయడానికి ఇరు కుటుంబాలు ఒప్పందం కుదుర్చుకుని పెళ్లికి సిద్ధమయ్యారు. విషయంపై 1098కు సమాచారం అందగా సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీఓ బాలాజీ, ఇతర సిబ్బంది గ్రామానికి వెళ్లి ఇరు కుటుంబాల పెద్దలకు బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇరు కుటుంబాల పెద్దలను తహసీల్దార్ ఫణికుమార్ వద్ద బైండోవర్ చేయించారు. నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి

బొమ్మనహాళ్: మండల పరిధిలోని జీడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామ సమీపంలోని వ్యవసాయ తోటల వద్ద ఖాళీ ప్రదేశంలో క్రికెట్ ఆడుతుండగా ఉన్న ఫలంగా తేనెటీగలు విరుచుకుపడ్డాయి. వాణి (3వ తరగతి), సందీప్‌రెడ్డి (6వ తరగతి), అరవింద్ (8వ తరగతి), కిరణ్ (ఇంటర్ ఫస్ట్ ఇయర్) గాయపడగా... మిగతావారు సమీపంలోని వాగులోకి పరుగెత్తి నీటిలో మునుగుతూ తేనెటీగల దాడి నుంచి తప్పించుకున్నారు. అటుగా పశువులను మేపుకుంటున్న ఆవుల నాగరాజు, ధనుంజయలపై కూడా దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి, నాగరాజు, ధనుంజలను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పుట్టపర్తి మండలం కప్పలబండ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరును పరిశీలించారు. కేంద్రానికి ఎన్ని గుడ్లు వచ్చాయి? స్టాక్ బ్యాలెన్స్, బుక్ బ్యాలెన్స్ ఎంత ఉందో తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. బాగా బోధించాలని కార్యకర్తకు ఆదేశించారు. భోజనం నాణ్యతను పరిశీలించారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన

కొత్తచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను శుక్రవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, శిక్షణపై ఎస్‌ఓ నాగరత్నమ్మతో ఆరాతీశారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లను పరిశీలించారు. కొత్తచెరువు పెద్ద చెరువు మొరువ శిథిలావస్థకు చేరి ప్రమాదంగా మారిందని మరువ మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



మామిళ్లపల్లి జెడ్పీ స్కూల్లో 'నాడు- నేడు' పనులను పర్యవేక్షిస్తున్న జేసీ చేతన్

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు- నేడు' పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని మామిళ్లపల్లి, ముక్తాపురం, కనగానపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ముక్తాపురం ప్రాథమిక పాఠశాల, కనగానపల్లి పాఠశాలల్లో 'నాడు- నేడు' కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల్లో పురోగతి చూపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కగానపల్లిలో భూ సర్వేపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. భూ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో రాళ్ల నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంఈఓ అరుణమ్మ, సర్వేయర్ స్టీఫెన్, జేఈ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



ముక్తియార్ (ఫైల్)

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనం అదుపుతప్పటంతో ఓ బాలుడు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఉద్దేహాళ్‌కు చెందిన వలిబాషా, ఫాతిమా దంపతులకు ముక్తియార్ (15) అనే కుమారుడు ఉన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉంటే ముక్తియార్ మేనమామ పెళ్లి 14న జరగనుండటంతో బంధువులంతా ఇప్పటికే కల్లుహోళ గ్రామానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని కల్లుహోళకు ముక్తియార్ తన స్నేహితుడు సుఫీయాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే కల్లుహోళ గ్రామ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. ముక్తియార్ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. సుఫీయాన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి వలిబాషా చికెన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ముక్తియార్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడంతో కుటుంబ సభ్యులు , బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

సిద్దరాచర్ల సర్పంచుపై దాడి

నార్పల: మండల పరిధిలోని సిద్దరాచర్ల గ్రామానికి చెందిన దళిత సర్పంచు సాకే రామాంజినేయులుపై జనసేన కార్యకర్త వినోద్‌కుమార్ శుక్రవారం దాడి చేశారు. వివరాల్లోకెళితే... దుర్గం గ్రామానికి చెందిన రత్నమ్మ అనే మహిళ తన ఇంటి ముందు మెట్లను రోడ్డుపై నిర్మిస్తుండటంతో సర్పంచు రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డితో కలసి వెళ్లి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించవద్దని సూచించారు. రోడ్డు పక్కన కాలువ ఏర్పాటు చేస్తామన్నారు. అయితే రత్నమ్మ వారి మాటలు లెక్క చేయకుండా రోడ్డును ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. ఇదిలా ఉంటే శుక్రవారం రామాంజినేయులు తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా రత్నమ్మ ఆయన వాహనానికి అడ్డు వచ్చి తన కుమారుడు జనసేన కార్యకర్త వినోద్‌కుమార్ సాయంతో హెల్మెట్‌తో దాడి చేశారు. స్థానికులు గాయపడిన రామాంజినేయులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దళిత సర్పంచుపై దాడి చేయడం సరికాదని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు జగదీష్‌నాయక్

రొళ్ల: విద్యుత్ తీగలు తగలడంతో జగదీష్ నాయక్ (21) అనే యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రత్నగిరి గ్రామంలో చోటుచేసుకుంది.. ఏఎస్‌ఐ బాలాజీ తెలిపిన వివరాలమేరకు... కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా ఐడీ హళ్లి హోబళి (మండలం) హోసకోటతండాకు చెందిన గోపినాయక్ కుమారుడు జగదీష్‌నాయక్ డ్రైవర్ అండ్ క్లీనర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన ఐచర్ (కేఏ06డీ7183) ఓనర్ మోహన్ పని నిమిత్తం జగదీష్‌నాయక్‌ను ఫోన్ చేసి పిలిచారు. దీంతో జగదీష్ నాయక్ అతని బంధువు శ్రీనివాస్‌నాయక్‌తో కలిసి రత్నగిరికి వచ్చారు. జగదీష్‌నాయక్ ఐచర్ వాహనం క్యాబిన్‌పైకి ఎక్కి టార్పాలిన్ సరి చేస్తుండగా అతని గొంతుకు 11 కేవీ విద్యుత్‌లైన్ అకస్మాత్తుగా తగలడంతో కుప్పకూలిపోయాడు. జగదీష్ నాయక్ వెంటనే 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జగదీష్ నాయక్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రేమ పేరుతో వివాహిత వేధింపులు

- ఆత్మహత్య చేసుకున్న యువకుడు



ఆత్మహత్య చేసుకున్న పృథ్వీ

రాయదుర్గంటౌన్: ప్రేమ పేరుతో వివాహేతర సంబంధంలో చిక్కుకుని చివరకు ప్రియురాలి వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయదుర్గం పట్టణంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న పృథ్వీ (35) గోబీమంచూరియా విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. పృథ్వీకి భార్య లలిత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై భార్య లలిత, తండ్రి కిష్టప్ప మాట్లాడుతూ పృథ్వీని ప్రేమ పేరుతో ఓ వివాహిత తరుచూ వేధింపులకు గురిచేసేదని తెలిపారు. బ్లాక్ మెయిల్ చేస్తుండటంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కళ్యాణ్

తాడిపత్రి: విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని అయ్యవారిపల్లి వద్ద ఉన్న బంజారా పరిశ్రమ వద్ద చోటు చేసుకుంది. బాలుడి తల్లి నాగేంద్రమ్మ వివరాలమేరకు... అయ్యవారిపల్లి తండాకు చెందిన నాగేంద్రమ్మ భర్త కంబగిరి స్వామి గతంలోనే మరణించాడు. వీరికి కళ్యాణ్ (13) ఉన్నాడు. సమీపంలో ఉన్న బంజారా పరిశ్రమ సమీపంలో స్క్రాప్ ఏరుకునేందుకు వెళ్లిన కళ్యాణ్ ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. విద్యుత్ తీగలు చిన్న బాలుడికి తగిలే ఎత్తులో వేలాడుతున్నాయంటే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఎంతలా ఉందో ఆలోచించండంటూ తల్లి నాగేంద్రమ్మ వాపోయింది. లైన్‌మెన్ నిర్లక్ష్యం మూలంగానే బాలుడికి ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జరిగిన ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

పది గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

రాయదుర్గంటౌన్: విద్యుదాఘాతానికి పది గొర్రెలు మృత్యువాత పడిన ఘటన రాయదుర్గం పట్టణంలోని వాల్మీకినగర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాధిత యజమాని తిప్పేస్వామి వివరాల మేరకు... కూలీ పనులతో పాటు జీవనోపాధి కోసం 60 దాకా గొర్రెలు, మేకలు పెంచుకుంటున్నట్లు తెలిపారు. గొర్రెల పెంపకం కోసం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశామన్నారు. అయితే శుక్రవారం ఉదయం కంచెకు విద్యుత్ సరఫరా కావడంతో తాకిన పది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు వాపోయారు. దాదాపు రూ.2 లక్షల దాకా నష్టం వచ్చిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.